

# తూటా తెచ్చిన తంటా

జి.వి.జి

"ఈరోజేళ ఎండ ఎక్కువగా ఉన్నట్లుంది కదండీ?" అంటూ ఆ విలేఖరి ఉస్సూరుమంటూ ఓ పాత కుర్చీమీద కూర్చున్నాడు.

"ఇదిగోండి—విసనకర్ర" అంటూ జోగులు విసనకర్ర అందించి, ఆయాసంగా లేచి వెళ్లి, ఆ గదికి పడమటి వైపున ఉన్న ఒకే ఒక కిటికీ తలుపు తెరిచాడు. ఓ మూల కుండనీటిలో ఉంచిన రెండు బీర్‌బాటిల్స్ పైకి తీసి, విలేఖరి వంక చూశాడు. "ఎండ తాపాన్ని హరింపచేసే చక్కని పానీయం."

"క్షమించాలి. డ్యూటీలో ఉన్నప్పుడు పుచ్చుకోలేను."

"అలాగా....మీకేం అభ్యంతరం లేకపోతే నేనే పుచ్చుకుంటాను. ముందు ఒక సీసా ఖాళీ చేస్తాను. దాంతో నేను మనిషిని రెండవుతాను, ఆ రెండో మనిషిచేత రెండో సీసా తాగించేస్తాను. ఏమంటారు?"

"నన్ను పంపించేశాక పుచ్చుకుంటే మంచిదేమో" అన్నాడు విలేఖరి.

"ఏం ఫర్వాలేదు. పీపాలు ఖాళీ చేసే వాడికి ఈ రెండు సీసాలు ఏమాత్రం! నిజం చెప్పాలంటే, నేను పెద్దమనిషిలాగా ఉండేది ఈ మందు కొట్టిన కాసేపే," అంటూ జోగులు నులక మంచంమీద కూర్చొని, ఒక సీసా మూత తెరిచాడు.

"మీకు శ్రమ ఇస్తున్నా. జరిగిందంతా పదే పదే చెప్పి ఈ పాటికే మీకు విసుగు కలిగి ఉండొచ్చు."

"విసుగేమిటి లెండి, ఆ నేరం జరిగాక పోలీసువారికి రెండు మూడు సార్లు చెప్పి ఉంటా. ఆ తర్వాత కోర్టులో విచారణలో వివరించా. అటుపైన మీలాగే ఏవో పత్రికల నించి ఇద్దరు ముగ్గురు రిపోర్టర్లు వస్తే చెప్పా. అంతే. మీతో మరోసారి చెప్పుకున్నందు వల్ల నా హృదయభారం కాస్త ఉపశమింప వచ్చు. అ నాగరాజును జైల్లో వేశాక ఈ విషయాన్ని చాలామంది మరిచిపోయి ఉంటారనుకున్నాను. అందుకే మీరు ఫలానా పని మీద ఈవేళ సాయంత్రం రాబోతున్నానని ఉదయం వచ్చి చెప్పినప్పుడు నాకు కాస్త ఆశ్చర్యం వేసింది. ఇంతకీ, ఈ వార్తను ఇంత ఆలస్యంగా మీపత్రికలో వేస్తారా?"

"సంచలనం కలిగించే ఈ వార్తకు అలస్యమేమిటి లెండి. ఎప్పటికీ సరికొత్తగానే ఉంటుంది."

"మీ పత్రిక పేరేమిటన్నారు?"

"ఆంధ్రప్రజ, ఢిల్లీనించి కొత్తగా వెలువడే వారపత్రిక, దానికి స్థానిక విలేఖరిని నేను."

"ఇది ఏ సంచికలో వస్తుంది?"

"ఈ ఆదివారం వెలువడే సంచికలో.... అన్నట్టు మీదగ్గర కలం. కొన్ని కాగితాలు ఉన్నాయా?"

"ఉన్నాయి....తెచ్చిస్తా." అంటూ జోగులు ప్రయాసతో లేచి వెళ్ళి, పక్కగది లోని పెట్టెలోంచి పాడ్, పెన్ తెచ్చి విలేఖరికి ఇచ్చాడు.

"ఇక చెప్తారా?"

జోగులు రెండు గుటకలు బీర్ తాగి, చెప్ప నారంభించాడు.

* * *

రతన్‌లాల్ డైమండ్ కంపెనీలో ఉద్యోగం దొరకడం నా అదృష్టమనే భావించాలి. ఆపెద్ద కంపెనీ గురించి మీరుకూడా వినే ఉంటారు. ప్రతిరోజూ కొన్ని లక్షల

రూపాయల వ్యాపారం సాగుతూంటుంది. మొదట అక్కడ ఆఫీస్ బాయ్‌గా చేరాను. రతన్‌లాల్ కాస్త కోపిష్టి అనుకోండి— ఆయన్ని పూర్తిగా అర్థం చేసుకోగల్గితే అంత మంచి యజమాని ఎక్కడా కనిపించడు. అయన తత్త్వానికి తగ్గట్టుగా పని చేయడం వల్ల నేమో—అచిరకాలంలోనే ఆయన ఆదరాభిమానాలకు పాత్రుడ్ని కాగలిగాను.

ఒకరోజు ఆయన బాంక్‌లో కట్టిరమ్మని నాకు కొన్ని నోట్ల కట్టలు, చలాన్ బుక్ ఇచ్చాడు. నేను ఆ నోట్ల కట్టలు లెక్కెడితే, ఒక వందరూపాయల నోటు ఎక్కువగా ఉంది. ఆ నోటును తీసి ఆయన కిచ్చాను. ఆయన సంతోషపడుతూ, "జోగులూ! రేపట్నుంచి నువ్వు సేల్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచెయ్యి." అన్నాడు. అప్పటికే రకరకాల వజ్రాల గురించి తెలుసుకున్నాను. కొంత మంది మామూలు ఖాతాదారులతోనూ నాకు పరిచయమైంది. అంచేత విక్రయశాఖలో పని చేయడం నాకేమంత కష్టమనిపించ లేదు. నాతోపాటు మరికొందరు సేల్స్‌మన్‌లు కూడా ఉండేవారు.


క్రమక్రమంగా వ్యాపారం మరింత వృద్ధి చెందడంతో రతన్‌లాల్ ఆ భవంతిలోనే తొమ్మిది చిన్న చిన్న గదులు నిర్మించాడు. వాటిని "నవరత్న గదులు" అనేవారం. అంటే, ఒక్కొ తెగ రత్నాలకు ఒక్కొగది అన్నమాట. నేను వజ్రాల గదిలో ఉండేవాడ్ని. నాకు జీతంకూడా మరింత పెరిగింది.

మా అందరిమీద నమ్మకంతో రతన్‌లాల్ వారానికి ఏ రెండుమూడు రోజులో తప్ప— మామూలుగా ప్రతిరోజు షాపుకు రావడం మానేశాడు. నాగరాజు జొరబడిన రోజున రతన్‌లాల్ కొట్టుకు రాలేదు.

ఆ రోజు మంగళవారం. అప్పుడే ఎవరో వచ్చి రెండు ఖరీదైన వజ్రాలు కొనుక్కెళ్ళారు. నాకు తలపోటుగా ఉంటే, ఆస్ప్రో—వేడి వేడి కాఫీ తెమ్మని కుర్రాడ్ని పంపించి, స్టూల్‌మీద కూర్చున్నా. అప్పుడొచ్చాడు నాగరాజు. హిప్పీలలాంటి జుట్టు. పులిచారల స్పోర్ట్స్ జాకెట్. వైట్‌పాంట్. మంచి గిరాకీ అనుకున్నా. వాస్తవానికి అతను కోటీశ్వరుని పుత్రుడే కదా? నేను లేచి నిలుచున్నా.

అతను నవ్వుతూ, "మీకో ప్రియురాలు ఉందనుకోండి. ఆమెకు ఓ ఉంగరాన్ని మీరు బహూకరించదలిచారు. ఆ ఉంగరానికి ఎలాంటి వజ్రం పొదిగితే బావుంటుందో సెలెక్ట్ చేయగల సమర్థులు మీరు. ఏదీ చూపించండి. ఈవేళ నా ప్రియురాలు పుట్టిన రోజు" అన్నాడు.

వెంటనే నేను నా ఎదురుగా ఉన్న బల్ల సొరుగులోంచి ఒక చిన్న ట్రేనుతీసి, అతని ముందు ఉంచాను. అప్పు డతను నలుదిక్కులా అదోలా చూడడం, అతని వాలకం నాకు కాస్త అనుమానం కలిగించకపోలేదు. ఎందుకైనా మంచిదని బల్లకింద ఉన్న అలారం స్విచ్ దగ్గరికి నా కాలును పోనిచ్చాను దానిని నొక్కితే చాలు ఆ భవంతిలో అన్నిదిక్కులా గంటలు మ్రోగుతాయి. వెంటనే గూర్ఖా వీధి తలుపును మూసేస్తా డన్నమాట. నాగరాజు ఆ ట్రేవంక చూసి పెదవి విరుస్తూ, "ఇంతకన్నా చక్కనివి లేవా? వేరే చూపించండి" అన్నాడు తడబడే గొంతుకతో.




దాంతో నాకు కూడా కంపరం పుట్టుకొచ్చింది. "ఊఁ....త్వరగా....!" అంటూ పాంట్ జేబులోకి చేతిని పోనిచ్చాడు.

అతనితో ఏం మాట్లాడ్డానికీ నాకు తోచింది కాదు. కొనుగోలుదార్లు వచ్చి ఏ మడిగినా చూపించడం నావిధి. ఆ కొట్టంతా భీమా చేయబడి ఉంది గనుక రతన్‌లాల్‌కు పోయిందేమీ లేదు. పోతే పోయేది నాప్రాణం మాత్రమే. అయినా, నేను మాత్రం నిష్కారణంగా ఎందుకు చావాలి? అంచేత, ఎక్కడ లేని ధైర్యాన్ని కూడ గట్టుకోడానికి ప్రయత్నిస్తుండగా నాగరాజు చేతిలో పిస్టల్ కనిపించింది. "నోరు తెరిచావా — నిలువునా కూలి పోతావ్—జాగత్త!" అంటూ అతను ఆ ట్రేలోంచి కొన్ని వజ్రాలు లాక్కోబోయాడు; అతని చేతి దూకుడుకు అట్రే ఇటు అటు ఊగి, కొన్ని వజ్రాలు దొర్లి కిందపడ్డాయి. వెంటనే నేను స్టూల్‌మీద కూర్చొని, కింద ఉన్న అలారం స్విచ్‌మీదికి నా కుడి కాలుని పోనిచ్చాను.

నేనేదైనా అఘాయిత్యం చేయ బోతు

న్నానవీ నాగరాజు పసికట్టినట్లున్నాడు. వెంటనే పిస్టల్ పేల్చాడు. నాకళ్ళు బైర్లు కమ్మాయి. చెవులు గింగురుమన్నాయి అంతే. ఆతర్వాత ఏం జరిగిందో నాకేమీ తెలియదు.

ఒక్క కుదుపుతో నాకు స్పృహ వచ్చింది నేను పడుకో బెట్టబడిఉన్న అంబులెన్సు ఆస్పత్రి వద్ద ఆగినట్లు గుర్తించాను. నన్ను స్ట్రెచ్చర్‌మీద కారిడార్ గుండా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్తుంటే పై కప్పుకున్న లైట్లు ఒక్కొక్కటిగా వెనక్కు వెళ్ళడం లీలా మాత్రంగా గోచరించ సాగాయి.

ఆపరేషన్ గదిలోంచి నన్ను తీసుకొచ్చి వార్డ్‌లో బెడ్‌మీద పడుకో బెట్టిన మూడు గంటలకు నాకు మత్తు విడిపోవడంతో పోలీసులు అడిగిన ప్రశ్నలకు జవాబు లివ్వ సాగాను. నాగరాజు మా కొట్టులోనే పట్టుబడిపోయాడుట.

కాని, అ దుర్మార్గుడు నా శరీరంలోకి జొప్పించిన తూటాను బయటకు తీయడానికి వీలుపడలేదని మాత్రం ఆ మర్నాడు నాకు తెలిసింది. అది నా దేహంలో అతిక్లిష్టమైన భాగంలో—అంటే రొమ్ము దగ్గర చిక్కుకుందన్న మాట. ఒక అరంగుళం పక్కగా దూసుకువచ్చి ఉంటే ఊపిరి తిత్తుల్లోనో, గుండెలోనో గుచ్చుకొని అక్కడికక్కడే గుటుక్కుమని ఉండేవాడ్ని. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా అదే. ఆ తూటాను తీయడానికి ఆ సున్నితమైన చోటు దగ్గర ఎక్కడ ఆపరేట్ చేసినా నాపెద్ద ప్రాణానికే ఆపత్తు. అందుకే సర్జన్లు ఆపరేషన్‌కు అంగీకరించలేదు.

ఆ తూటా అక్కడ ఉన్నందువల్ల నా కొచ్చే ప్రమాదం ఏమీ ఉండదంటూ కొన్ని ఎక్స్‌రేలు కూడా చూపించి నాకు నచ్చ చెప్పారా సర్జన్లు. కాని, నాకు మాత్రం తెలుసు ప్రాణం తీసే తూటా నా దేహంలో ఉన్నంత వరకు ఎప్పటికైనా నాకు ముప్పే అని.

కొన్ని రోజులవరకు నా గుండెమీద కుంపటి పెట్టినట్లు ఉండేది. ఒక రిద్దరు స్పెషలిస్టులు కూడా ఆ హాస్పిటల్‌కు పిలిపించబడ్డారు. వాళ్ళూ ఆ ఎక్స్‌రేలు చూసి, నన్ను పరిశీలించాక పెదవి విరిచారు....సరే అంతకు ముందు కొంతమంది పత్రికల రిపోర్టర్లు వచ్చారన్నానా? వాళ్ళల్లో ఒకతను "మీకేం ప్రమాదం లేదంటున్నారు కదా? ఆ తూటా మీవొంట్లో ఉన్నందువల్ల మీ కొచ్చిన నష్టమేమిటి?" అంటూ ఓదార్చాడు. ఆ తర్వాత మా కొట్టులోంచి ఒక స్నేహితుడు వచ్చి, "ఎంత కాలం ఆ తూటాను నీ శరీరంలో మోసుకు తిరుగుతావ్?" అన్నాడు. నేనేం జవాబు చెప్పేది?

నేను గుర్తుపట్టడానికి ఆ నాగరాజుగాడిని ఆ ఆస్పత్రికే తీసుకు వచ్చారు పోలీసులు. వాడ్ని గుర్తించినందువల్ల నాకు ఒరిగేదేమిటి వాడ్ని శిక్షించినంత మాత్రాన నాకు గండం తప్పుతుందా?

ఆ ఆస్పత్రిలోని డాక్టర్లు యిక అంతకు మించి తామేమి చేయలేమనే నిర్ణయానికి వచ్చారేమో—కొంత కాలమయ్యాక బాండేజ్ తీసేసి, నన్ను డిశ్చార్జ్ చేశారు. జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పుడూ వెల్లకిలా పడుకోనుండాలన్నారు. చేతి కండరాలకు ఎక్కువ శ్రమ కలిగించే ఏ పనీ చేయకూడదన్నారు. ఏ విధమైన బెంగెట్టుకోకుండా ఎంత నిశ్చింతతో ఉంటే అంతమేలన్నారు. మంచిటానికులు పుచ్చుకోవాలంటూ ఏవేవో సలహాలిచ్చారు.

నాలో నేను నవ్వుకున్నాను. అంతకు మించి ఇంకేం చేయగలను? నిశ్చింతతో ఉండడమంటే మాటలా? నాకు ధైర్యం చెప్పడానికి ఆ వైద్యులు ఆ మాటలన్నారు గాని, నేను ఇక ఎంతోకాలం బతకనని వాళ్ళకు మాత్రం తెలీకుండా ఉంటుందా?

పుట్టినవాడు ఏనాటికైనా గిట్టక తప్పదు. కాని, ఇంత బ్రతుకూ బ్రతికి చివరికి ఇలాంటి దుర్మరణం పొందవలసి వస్తుందేననే నా బాధ.

వారం....లేక నెల....మెత్తానికి ఏడాదికి పైగా నేను బతకగలనా?

కోర్టులో విచారణకు నేను హాజరవడానికి వీలవుతుందా అని అడిగితే—వీలవుతుందనే చెప్పా. ఆ నాగరాజుగాడికి ఎంతటి కఠినశిక్ష విధింపబడుతుందో నా చెవులారా వినాలి.

సగంవరకు నాగరాజు తాలూకు జనంతోనే కోర్టు నిండిపోయి ఉంది. కొందరి ముఖాలు విచారంగా ఉన్నాయి. కొందరు నా వంక క్రోధంతో చూస్తున్నారు. ఇక నాగరాజు తల్లిదండ్రుల దుఃఖం వర్ణనాతీతం. నాగరాజు చిన్నప్పట్నించే చెడు సావాసాలకు అలవడ్డాడు. ఇంతవరకు ఎంతో డబ్బు మద్యానికి, మగువలకు, జూదాలకు తగలేశాడు అంచేత కోటీశ్వరరావు విసుగు చెంది, ఇటీవల వాడికి డబ్బు ఇవ్వడం తగ్గించేశాడు. అందుకే వాడు దోపిడీతనానికి పూనుకున్నాడన్న మాట. వాళ్ళ వంశ గౌరవ మర్యాదలను మంట గలిపాడు. ఎంత చెడ్డా—కన్న కొడుకుకు ఈ దుర్గతి పట్టినందుకు ఏ తండ్రి హృదయం తల్లడిల్లిపోదు? అయినా, ఇప్పుడు చేతులు కాలిం తర్వాత ఆకులు పట్టుకొని ప్రయోజన మేమిటి?

జడ్జిగారు "ఆర్డర్! ఆర్డర్!" అని అరిచారు. అప్పటికీ కోర్టులో సద్దు మాటుమణగలేదు. కొందరిని బలవంతంమీద బయటకు పంపించేశాక విచారణ ప్రారంభమైంది. ముద్దాయి తరపు ప్లీడరు ఎంతో తెలివితేటలతో వాదించాడు. ఎంత వాదించినా ప్రయోజన మేమిటి? చివరికి నాగరాజుకు 30 ఏళ్ళ శిక్ష విధించబడింది. నా శరీరంలో ఆ తూటా కనక లేకపోయి ఉంటే, ఆ శిక్షకాలం మరి కాస్త తగ్గించబడి ఉండేదేమో! అంతేగాదు, అతను హత్యా ప్రయత్నం చేసినా—ఓ వైపున నేను ఊపిరి పీలుస్తూ తిరుగుతున్నందువల్ల అతనికి ఆ మాత్రం జైలు శిక్ష పడిందేకాని, నా ప్రాణం ఎగిరిపోయి ఉంటే, అతనికి ఉరి శిక్షే విధించబడి ఉండేది.

ఇప్పటికీ, ఆ జైలు శిక్షతో పోతుందని ఏముంది? నా శరీరంలో ఆ తూటాతో నేను ఇంకా 30 ఏళ్ళవరకు సజీవంగా ఉంటేనే, ఆ తర్వాత నాగరాజు వృద్ధుడుగా విడుదలయ్యేది. అతని కర్మ కొద్దీ ఆ తూటా—నా ప్రాణంతీస్తే, అతను హంతకుడుగా

హత్యానేరంపై మళ్ళీ విచారణ ఉంటుంది.

అందుకే ఓ వైపున జైల్లో అతనూ, మరోవైపున యింట్లో అతనింటిల్లిపాదీ నా క్షేమం కోరుతూ అనుదినం ఎందరో దేవుళ్ళకు మొక్కుతూండాలి. అతని నాన్నగారి ధర్మమా అని ఈ ఇంటిని ఇటీవలే నాకు అద్దెకు తీసిచ్చారు. అన్ని ఏర్పాట్లూ వాళ్ళే చూసుకుంటున్నారు. రెండు పూటలా నాకు కాఫీ, ఫలహారాలు, భోజనాలు యిక్కడికి సప్లయ్ చేయబడుతున్నాయి. ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి— ప్రతిరోజూ ఒక డాక్టర్ వచ్చి నన్ను పరీక్ష చేసి పోతున్నాడు. మింగడానికి ఖరీదైన మాత్రలు కొనిస్తున్నారు, ఈ బీరుకాయలు, సిగరెట్లులాంటివి తెచ్చివ్వడానికి ఒక నౌఖరు కూడా అప్పుడప్పుడు వచ్చి పోతూంటాడు. పోలీస్‌స్టేషన్‌నించి ఒక హెడ్ కానిస్టేబుల్ కూడా ప్రతిరోజూ మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో ఒకసారి వచ్చి నన్ను చూసి పోతూంటాడు, వీళ్ళుకాక నన్ను ఇతరులెవరైనా చూడడానికి రావాలంటే ముందుగా, పోలీసులకు తెలియజేయవలసి ఉంటుంది. అందుకే మీరు ఉదయం నన్ను ఇంటర్‌వ్యూ చేయడానికి వచ్చానంటే, సాయంత్రం రమ్మన్నాను. అలాగే నిన్న మా రతన్‌లాల్ షాహుకారు నన్ను చూడడానికి రాబోతున్నారంటే ఆ హెడ్ కానిస్టేబుల్ ద్వారా అనుమతి సంపాదించానన్న మాట.

ఇలా దర్జాగా ఉన్నానిక్కడ. నాకిప్పుడు ఏ లోటూ లేదు. పూర్వ జన్మలో ఏం పుణ్యం చేసుకున్నానో కాని, ఈ జన్మలో ఈ స్థితిలో ఇలా నా కడుపులో చల్ల కదలకుండా, శరీరంలో తూటా మెదలకుండా హాయిగా తిని ఉండగల్గుతున్నాను. ఇక, బతికినంతవరకు నాకు ఏ ఢోకా లేదు. అనుక్షణం దిగులుతో కుమిలిపోతూ ఉండేదల్లా నాగరాజూ, అతని ఆయిన వాళ్ళూనూ. వాళ్ళ ప్రార్థనలు ఫలించకపోతే ఫస్ట్ డిగ్రీ మర్డర్ అభియోగంపై నాగరాజుకు ఇక ఉరిశిక్షో ఆ జన్మాంత కారాగారవాసమో తప్పదు.

చివరికి ముగింపు ఏమిటంటే, ఇక్కడ నేను చస్తే, అక్కడ నాగరాజు ఆయువు కూడా మూడుతుందన్నమాట. తమాషాగా లేదూ?

* *

జోగులు కథంతా వివరించేసరికి రెండో బీర్ బాటిల్‌ను కూడా ఖాళీ చేసేశాడు.

విలేఖరి కాగితాలు మడిచి జేబులో పెట్టుకుంటూ. "ఎటూ నీకు త్వరలోనే చావు తప్పదంటున్నావు కదా? వెంటనే చస్తే ఏం?" అన్నాడు.

జోగులు తెల్లబోయాడు. వెంటనే తమాయించుకొని, 'చావడం నా చేతుల్లో ఉందా?'

"ఎందుకు లేదు? కుడి ఎద వద్ద చొచ్చుకుపోయిన ఆ తూటాపై కాస్సేపు బలంగా నొక్కి ఉంచితే నీ ప్రాణం పోతుందని నేను తెలుసుకునే వచ్చా."

"ఏమిటి మీరంటున్నది? ఇక్కడ నా ప్రాణం పోతే అక్కడ ఆ నాగరాజు గతి ఏమౌతుంది?" జోగులు భయంగాచూశాడు.

"వాడింకా బతకాలని ఎవరికుంది? ఆ నాగరాజు తమ్ముడ్నే నేను."

"ఆఁ....ఐతే, మీరు పత్రికా విలేఖరి కాదన్నమాట ఎందుకు అబద్ధమాడారు?"

"అదను చూసి నా ప్లాను అమలు పరచడానికి."

"ఏమిటి మీ ప్లాను?"

"అదే చెప్పొస్తున్నా....చిన్నప్పట్నించి అల్లరిమూకతో తిరుగుతూ ఇంతవరకు మా ఆస్తిపాస్తుల్నీ కొంతవరకు పాడు చేసిన మా అన్న ఎంత త్వరగా ఉరికంబ మెక్కితే అంత మంచిది. మా నాన్న తదనంతరం మిగిలిన యావదాస్తీ నాకే దక్కడానికి అదొక్కటే మార్గం. అంతవరకు నీ పోషణకు వేరే అనవసరంగా మరి కొంత డబ్బు హరించుకుపోతే చివరికి నా చేతికి చిప్ప వస్తుంది." అంటూ నాగరాజు తమ్ముడు గంగరాజు రెండడుగులు ముందుకు వేసి జోగులును సమీపించబోయాడో—లేదో "హాండ్సప్!" అన్న కంఠం వెనుకవైపు నించి వినిపించింది.

గంగరాజు అదిరిపడి వెనుతిరిగి చూశాడు.

డిటెక్టివ్ చాణక్య పైప్ పీలుస్తూ, గంభీరంగా నిలుచోనున్నాడు. పక్కనున్న పోలీసులు గంగరాజును పట్టుకున్నారు.

చాణక్య. జోగులును సమీపిస్తూ, "చూశావా, జోగులూ? ప్రతిరోజూ ఒక హెడ్ కానిస్టేబుల్ ఇక్కడికి వచ్చి నిన్ను చూసి పోవడం ఎందుకని నువ్వు నిన్న అడిగావా? కొంతకాలంవరకు ఇలాంటి ఏర్పాటు ఉండడం మంచిదని నే నెందుకు అన్నానో ఇప్పుడు తెలిసిందా? ఈ వేళ సాయంత్రం 'ఆంధ్రప్రజ' అనే ఢిల్లీనించి వెలువడే పత్రికా విలేఖరి నిన్ను చూడడానికి రాబోతున్నట్లు నువ్వు ఆ హెడ్ కానిస్టేబుల్ ద్వారా నాకు తెలియజేయగానే నాకు కాస్త అనుమానం వేసింది. ఎందుకంటే, ఆ పత్రిక పేరు నేనెన్నడూ వినలేదు. ఒకవేళ కొత్తగా వెలువడుతూందేమోనని ఇక్కడి రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫీసులో వాకబు చేస్తే, ఆ పేరుగల పత్రికకు ఏ ఊళ్ళోనూ డిక్లరేషన్ తీసుకోబడనట్లు తెలిసింది. అందుకే ఇన్‌స్పెక్టర్ జాకబ్, నేను ఇందాక గంట నించి ఈ వీధి మొగదలలో కాపు కాచి ఉన్నాం. ఈ గంగరాజు మీ ఇంట్లోకి ప్రవేశించేసరికి మేం కూడా ఈ ఇంటి దగ్గరికి చేరుకుని పొంచి వినసాగాం." అంటూ గంగరాజు వంక తిరిగి, 'మిస్టర్ గంగరాజూ! పత్రికా విలేఖరినని చెప్పుకుంటూ ఇక్కడికి వచ్చిన మీరు 'కాగితాలు కలం లేకుండా వస్తారా? అవి కావాలని మీరు జోగులును అడిగినప్పుడే నా అనుమానం మరింత బలపడి, ఇన్‌స్పెక్టర్ జాకబ్ చేత ఈ కానిస్టేబుల్స్‌ను పిలిపించాను.' అంటున్నప్పుడు గంగరాజు చేతులకు బేడీలు పడ్డాయి.